పేదల లోగిళ్లలో ఉగాది పండగ

- కొత్తగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు
- 3 వేల మంది లబ్ధిదారులతో గృహ ప్రవేశానికి ఏర్పాట్లు

రాయవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారం అవుతోంది. ఇంటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు సొంతంగా ఇంటిని నిర్మించుకునే అవకాశం కలిగింది. సెంటు స్థలం గాని, ఇల్లు గాని లేని నిరుపేదలను గుర్తించి జగనన్న కాలనీల్లో స్థలాలు మంజూరు చేసి, లబ్ధిదారు పేరు మీద ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసింది. స్థలాలు పొందిన వారందరికీ ప్రభుత్వ ప్రోత్సాహకం కింద నూతన గృహాలను మంజూరు చేసింది. ప్రస్తుతం జగనన కాలనీలతో పాటుగా గ్రామాల్లో సైతం ఇంటి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయినంత మేరకు వెంటనే హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, బిల్లులను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. సకాలంలో బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్తు సౌకర్యం, తాగునీరు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో 143 జగనన్న లే అవుట్లు వేశారు. ఈ లేఅవుట్ల పరిధిలో 13,068 లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఈ స్థలాల లబ్ధిదారులకు ఇళ్లు కూడా మంజూరు చేసింది. అలాగే సొంత స్థలాలున్న 2,013 మందికి కూడా ఇళ్లు మంజూరు చేసింది. గతంలో నిర్మాణం ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న 682 ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 15,763 ఇళ్లకు అనర్హులు 758 మంది ఉండగా, అర్హులైన లబ్ధిదారులుగా 15,005 మందిగా గుర్తించారు.

ఇదీ ప్రగతి

రెండు నియోజకవర్గాల పరిధిలో 15,005 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకూ 58 మంది ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించలేదు. బిలో బేస్‌మెంట్ లెవల్‌లో 6,715, పునాది స్థాయిలో 4,867, రూఫ్ లెవెల్‌లో 511, శ్లాబ్ స్థాయిలో 389 ఇళ్లు ఉండగా, 2,519 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఉగాది పండగ రోజు మూడు వేల మందికి లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.



సోమేశ్వరంలోని జగనన్న కాలనీ

మండలం	లేఅవుట్లు	మంజూరైన ఇళ్లు	నిర్మాణంలో ఉన్న ఇళ్లు
కె.గంగవరం	44	1380	1380
ఆర్‌సీపీఎం (అర్బన్)	11	1405	1393
రామచంద్రపురం	21	2572	2537
కపిలేశ్వరపురం	25	1416	1416
మండపేట	21	4564	4560
మండపేట అర్బన్	02	2018	2016
రాయవరం	19	1650	1650

హౌసింగ్ డే

లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రతి శనివారం గృహ నిర్మాణ శాఖ అధికారులు హౌసింగ్ డే నిర్వహిస్తున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇళ్లు మంజూరైన వారందరికీ సిమెంట్, ఐరన్, ఇసుక తదితర ముడి సరకును ప్రభుత్వమే అందజేస్తుంది. మొదటి బిల్లులో భాగంగా రూ.70 వేలు బిల్లు ఇస్తుండడంతో ప్రభుత్వంపై నమ్మకం కలుగుతోంది. లబ్ధిదారులంతా ఇళ్లను నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు హౌసింగ్ అధికారులు ప్రతి గ్రామానికి వెళ్తూ లబ్ధిదారులను కలిసి పనులు వేగవంతం అయ్యేలా చూస్తున్నారు. ఆలస్యం కాకుండా బిల్లులు మంజూరు చేస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం



మా గ్రామంలో 301 ఇళ్ల స్థలాలకు 261 మందికి ఇళ్లను కేటాయించగా, వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. జగనన్న కాలనీగా నామకరణం చేశాం. పేదలందరూ ఇళ్లు నిర్మించుకున్నారు. పేదల లోగిళ్లలో ఉగాదికి పెద్ద పండగగా జరుపుకోనున్నారు. ఇంత వేగంగా కాలనీ ఏర్పడడం హర్షదాయకం.

– ఆరిఫ్, సర్పంచ్, సోమేశ్వరం, రాయవరం మండలం

ఆనందం మాటల్లో చెప్పలేం



నివశించడానికి ఇల్లు లేని పరిస్థితుల్లో చాలా ఇబ్బందులు పడ్డాం. మాకు స్థలాన్ని కేటాయించడమే కాకుండా ఇంటి నిర్మాణానికి రుణాన్ని అందజేశారు. మాకు కొత్తగా కాలనీ ఏర్పడింది. తాగునీరు, విద్యుత్తు, రహదారులు అన్నీ ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటిల్లిపాదికీ సంతోషంగా ఉంది.

– కేతా పార్వతి, లబ్ధిదారురాలు, సోమేశ్వరం, రాయవరం మండలం

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

మండపేట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు ఆపార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోను పార్టీ జెండాలు ఎగుర వేయనున్నారు. గడిచిన 12 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించి సంపూర్ణ ప్రజాబలంతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీలన్నింటినీ అమలుచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వేడుకల్లో భాగంగా నియోజకవర్గంలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని శనివారం ఎమ్మెల్సీ తోట పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మండపేటలో..

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం 10.30 గంటలకు మండపేట రాజారత్న సెంటర్లోని దివంగత వైఎస్ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్టు పార్టీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై వేడుకలు నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని పుల్లేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.

కిట్స్‌లో విద్యా పరిరక్షణ శత చండీయాగం ప్రారంభం



కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శత చండీ మహాయాగంలో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రాజారత్న హెల్త్‌కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న అంబికపల్లి అగ్రహారం గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 30 మంది వేద పండితుల బ్రహ్మత్వాన విద్యా పరిరక్షణ శత చండీ మహాయాగం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ యాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ బర్ల, డైరెక్టర్లు వంశీ పవన్, రామారావు, ఏట రవిధర్, ఆర్గనైజింగ్ కమిటీ సాయికాంత్, శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఉండూరులో మెగా వైద్య శిబిరం



ఉండూరులో ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరులో బేతెస్ద సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన వైద్యులు డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ అమృతరావు, డాక్టర్ శ్రీనివాసరావు మరికొంత వైద్యుల పర్యవేక్షణలో సుమారు 200 మందికి దంత, కంటి, జనరల్ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషం, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ దంగేటి వెంకటరమణ(చినబాబు), అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా వంతెన



వంతెన వద్ద రెయిలింగ్స్ విరిగిపోయి ప్రమాదభరితంగా ఉన్న గొయ్యి

మండపేట: మండలంలోని మెర్నిపాడు-వెలగతోడు రోడ్డులోని మండపేట కెనాల్‌పై గల వంతెన ప్రమాదభరితంగా తయారైంది. మండపేట, మండలంలోని ఇప్పనపాడు, పాలతోడు, ఏడిద, వై.సీతానగరం తదితర గ్రామాల ప్రజలు కడియం, రాజమహేంద్రవరం వెళ్లేందుకు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. మండపేట కెనాల్‌పై గల ఈ వంతెన మలుపును ఆనుకుని ఉన్న రెయిలింగ్‌లు పూర్తిగా విరిగిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురికావాల్సి వస్తోంది. వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వంతెనపై నుంచి దాదాపు 12 మీటర్ల దిగువన ఉన్న కాలువలో పడిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించి వంతెన మలుపు వద్ద రెయిలింగ్స్ ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పసిడి కుండల ప్రతిష్ఠ

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయ శిఖరానికి పసిడి కుండలను శనివారం ప్రతిష్ఠించారు. అమలాపురానికి చెందిన నాగలక్ష్మి ఐరెన్ స్టోర్స్ కాంట్రాక్టర్ గుల రాంప్రసాద్, అరుణ్‌కుమార్, మల్లేశ్వరరావులు సమకూర్చిన రూ.20 లక్షలతో రాజగోపురాన్ని నిర్మించారు. రూ.40 వేలు విలువ చేసే మూడు పసిడి కుండలను ప్రతిష్ఠించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఘనంగా సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



యనమదల సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో వేంచేసిన గ్రామదేవత సోమాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూతనంగా పునర్నిర్మించిన ఆలయంలో యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్యులు, యలమంచిలి బ్రహ్మలింగ ప్రసాద్, అయిలూరి శ్రీనివాస్‌ల బ్రహ్మత్వంలో మూలవిరాట్ సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ గోలి వీవీ సత్యనారాయణ, మంగాదేవి చేతుల మీదుగా, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ దేవళ్ల వెంకటబుల్లిరాజు, వెంకటలక్ష్మి దంపతులు చేతుల మీదుగా, శిఖర ప్రతిష్ఠ టేకుమూడి శ్రీనివాస్-సునీత, కట్టా శ్రీనివాస్-అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో అందరూ ఐకమత్యంతో దేవాలయ నిర్మాణానికి కృషి చేశారని అభినందించారు. గ్రామ పెద్దల కోరికపై ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. రాత్రి జాతర, తీర్థంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్, సర్పంచ్ పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కుక్కల గోవిందు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



డాక్టర్ మమతకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న నోడల్ అధికారి సందీప్‌నాయుడు

రామచంద్రపురం రూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని నోడల్ అధికారి డాక్టర్ టి.సందీప్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని ద్రాక్షారామ గ్రామ సచివాలయం వద్ద శనివారం మండల కన్వర్జెన్సీ కోఆర్డినేషన్ సమావేశం సందీప్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సందీప్‌నాయుడు మాట్లాడుతూ ఒకటో సంవత్సరం నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారికి ఈ నెల 14 నుంచి అంగన్‌వాడీ స్కూల్స్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కోరారు. దీనికి వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యా సిబ్బంది సహకరించాలని కోరారు. రామచంద్రపురం అర్బన్ పరిధిలో 12,240 మంది, ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 8,139 మంది, వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 2,944 మంది చిన్నారులు ఉన్నారన్నారు. వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మమత మాట్లాడుతూ నులిపురుగల నిర్మూలనతో రక్తహీనత రాకుండా ఉంటుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా నులి పురుగులు శరీరంలో ప్రవేశించవని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్వీ ఆదినారాయణ, సీహెచ్‌ఓ వీరవేణి, డివిజన్ సూపర్‌వైజర్ గోవిందబాబు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఈశ్వరమ్మ, కమలేశ్వరి, రాజేశ్వరి, వీరలక్ష్మి, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గృహసారథికి చైర్‌పర్సన్ పరామర్శ

మండపేట: ప్రమాదవశాత్తు ఇటీవల కాలికి గాయమై శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పట్టణంలోని 20వ వార్డు గృహ సారథి సేనాపతి దొరబాబును మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి శనివారం పరామర్శించారు. అతని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేరూరి మాధవి, గనిపే భూషణం, కొమ్మోజు నాగేశ్వరరావు, పత్రి రమణ, ఇండుగుమిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల అభివృద్ధికి కృషి



అద్దంకివారిలంక గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: మండలంలోని లంక గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధం కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక సచివాలయం వద్ద శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు, ఉద్యాన పంటల సాగు తదితర అంశాలపై చర్చించారు. గ్రామస్తులు లేవనెత్తిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, కార్యదర్శి సీహెచ్.నరసింహారావు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు నాయకులు పాల్గొన్నారు.

మాయమైపోతున్నడమ్మా..

- ఓ మహిళపై సోదరుల కక్ష
- రెండు కుటుంబాలు చిన్నాభిన్నం
- కొవ్వూరి సత్యవేణి హత్యోదంతం



హతురాలు కొవ్వూరి సత్యవేణి (ఫైల్)



తల్లి రాక కోసం ఎదురు చూస్తున్న ఉమామహేశ్వరరెడ్డి

రాయవరం: "మాయమైపోతున్నడమ్మా...మనిషన్నవాడు...మచ్చుకైనా లేదు చూడు మానవత్వం ఉన్నవాడు".. అంటూ తెలంగాణ ప్రజాకవి అందెశ్రీ రాసిన గేయం రాయవరం మండలం మాచవరం సమీపంలో జరిగిన హత్యోదంతాన్ని గుర్తుకు తెస్తోంది. గత నెల 24న కొవ్వూరి సత్యవేణి (54) హత్యకు గురైన విషయం విదితమే. మాచవరం శివారు దేవుడు కాలనీకి చెందిన ఇద్దరు అవివాహిత సోదరులు ఆమెపై తొలుత అత్యాచారం చేసి, అనక హత్య చేశారు. ఈ ఘటన హతురాలి కుటుంబాన్నే కాదు హత్యకు పాల్పడిన వారి కుటుంబాన్ని కూడా చిన్నాభిన్నం చేసింది. గతంలో దేవుడు కాలనీకే చెందిన అన్నదమ్ములు నల్లమిల్లి ఉమామహేశ్వరరెడ్డి, నల్లమిల్లి వెంకట సత్యనారాయణరెడ్డిలు సత్యవేణిపై అసభ్యంగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని ఆమె బయట పెట్టడంతో అన్నదమ్ములు ఆమెపై కక్ష పెంచుకుని, ఈ దురాఘతానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ఆ సోదరుల తల్లి నల్లమిల్లి పద్మ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల విచారణలో వాస్తవాలు బయట పడడంతో అన్నదమ్ములు కటకటాల పాలయ్యారు. దాంతో వారి కుటుంబం రోడ్డున పడింది.

హతురాలి కుమారుడి మూగ వే(రో)దన..

హతురాలు సత్యవేణి భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఇరువురు కుమారులు. పెద్ద కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. మూగ, చెవిటి వాడైన చిన్న కుమారుడు ఉమామహేశ్వరరెడ్డిని తల్లి సత్యవేణి కంటికిరెప్పలా కాపాడుకుంటోంది. తల్లి సత్యవేణి హత్యకు గురైన విషయం ఉమామహేశ్వరరెడ్డికి తెలియకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు. 15 రోజులుగా తల్లి కనిపించకపోవడంతో అతడు ఆహారం తీసుకోవడం లేదు. అమ్మ వస్తుందని చెప్పినా వినకుండా ఒంటరిగా గదిలోనే గడుపుతున్నాడు. ఉమామహేశ్వరరెడ్డిని ఎలా ఊరడించాలో తెలియక తాతయ్య ద్వారంపూడి గంగరాజు మదనపడుతున్నాడు.

కఠినంగా శిక్షించాలి

కొవ్వూరు సత్యవేణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ పూర్వపు జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధు డిమాండ్ చేశారు. మానవత్వం మరచి అత్యాచారం చేసి మహిళలను హతమార్చిన నిందితులను దిశ చట్టం ప్రకారం ప్రభుత్వం 21 రోజుల్లో శిక్షించాలని అన్నారు. కొవ్వూరి సత్యవేణి కుటుంబసభ్యులను సిద్ధు పరామర్శించారు.

పాడిపశువులకు టీకా వేయించండి



దంగేరు శివారు కోనరేవుపాడులో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

కె.గంగవరం: పశువులకు పాడి రైతులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అన్నారు. మండలంలోని దంగేరు శివారు గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సిన్ ప్రక్రియను శనివారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తుందని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడి రైతులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. వీటికి తోడు ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి పాడిరైతు ప్రభుత్వ ప్రోత్సాహాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు. పశువైద్యాధికారి కేవీ రామరాజు, పశువైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



వికాస్ కళాశాలలో అలరించిన విద్యార్థినుల ఆటపాటలు

రామచంద్రపురం: విద్యార్థి దశలో ఇంటర్ విద్య ఎంతో కీలకమైందని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి తగ్గట్టుగా సాధన చేయాలని వికాస్ విద్యాసంస్థల అధినేత వీవీ రమణ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని వికాస్ విద్యా సంస్థల ప్రాంగణంలో ఇంటర్, ఒకేషనల్ గ్రూప్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణ మాట్లాడుతూ పరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. విద్యతో పాటుగా ప్రస్తుత సాంకేతికతను అందింపుచ్చుకునేందుకు తగిన కృషి చేయాలన్నారు. దానికి తగ్గట్టుగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఎంచుకున్న లక్ష్యాలను సాధించటంతో పాట తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని రమణ అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోటతో క్రిస్టియన్ మైనార్టీ సెల్ నేతలు



ఎమ్మెల్సీ తోటను కలిసిన బాబూరావు తదితరులు

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు మండపేట క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా కనపాల బాబూరావు నియమితులైన సందర్భంగా ఎమ్మెల్సీ తోటను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బాబూరావును ఎమ్మెల్సీ తోట అభినందించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో క్రైస్తవ సోదరులు వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని అందించేందుకు క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు కృషిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు ఎస్ శామ్యూల్, పి పరంజ్యోతి, కె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా గట్టెక్కేనా..?



బంధనపూడిలో తెగుళ్ల నిర్మూలన కోసం పొలంలో మందులు పిచికారీ చేస్తున్న రైతులు

- వరిపై విజృంభిస్తున్న తెగుళ్ల బెడద
- ఆందోళనలో రైతులు

కాజులూరు: దాళ్వాపై తెగుళ్ల బెడదతో రైతన్న ఇబ్బందులకు గురవుతున్నాడు. ప్రస్తుత దాళ్వాలో కాజులూరు, మండలంలో 20,500 ఎకరాల్లోను, రామచంద్రపురం మండలంలో 19 వేల ఎకరాల్లోనూ, కె గంగవరం మండల గ్రామాల్లో 16 వేల ఎకరాల్లోనూ వరిసాగు చేపట్టారు. ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ రైతులు సాగు ముందుకు కొనసాగుతుండగా ఊహించని తెగుళ్లు పంటలపై దాడి చేస్తున్నాయి. సాధారణంగా ఫిబ్రవరి నెలాఖరు నాటికే పంట చిరుపొట్ట దశ నుంచి ఈనిక దశకు చేరుకునేది. దీంతో ఎండలు ముదిరినా పెద్దగా ప్రభావం ఉండేది కాదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. గత తొలకరి చివరి దశలో తుఫాన్లు సంబవించి భారీ వర్షాలు కురవటంతో మాసూళ్లకు తీవ్ర అవరోధాలు ఎదురయ్యాయి. నూర్పిళ్లు ముగించి పంట దమ్ములు పూర్తి చేసుకుని నారుమడులు వేసుకున్న తర్వాత మరలా వర్షాలు కురవటంతో కొందరు రైతులు రెండేసి మార్లు నారుమడులు చల్లుకోవలసి వచ్చింది. ఫలితంగా నిర్ణీత వ్యవధిలో కాకుండా ముందు, వెనుకా రైతులు రబీ సాగు చేపట్టారు. దీంతో ప్రస్తుతం వరిపంట ఒక్కో చోట ఒక్కో దశలో ఉంది. ముందుగా నాట్లు వేసిన చోట వరి పంట చిరుపొట్ట దశలో ఉండగా ఎక్కువ విస్తీర్ణంలో ఆలస్యంగా నాట్లు పడిన పొలాల్లో దుబ్బుకట్టే దశలో ఉంది. రాత్రి పూట మంచు కురుస్తుండటం, పగటిపూట అధిక ఉష్ణోగ్రతలతో పలు రకాల తెగుళ్లు రబీపై దాడిచేస్తున్నాయి. ఆలస్యంగా నాట్లు పడిన పొలాల్లో ఈ బెడద అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా దుబ్బుకుళ్లు తెగులుతో పాటు జింక్‌లోపం, మొవ్వపురుగు, ఉల్లికోడు, మాగుడు తెగులు, తామర పురుగు ప్రభావం కనబడుతోంది. కాలువనీరు సక్రమంగా రాకున్నా వ్యయప్రయాసలతో డ్రైన్లలోనూ, పంటకాలువల్లోనూ నీటిని ఇంజిన్లతోను, గుల్లలతోనూ తోడుతూ సాగు చేస్తుంటే తెగుళ్లు పంటకు నష్టం కలుగజేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తీవ్ర వ్యయప్రయాసల కోర్చి రబీ సాగు చేస్తున్న తరుణంలో ప్రస్తుత పరిస్థితి దిగుబడులను దెబ్బతీస్తుందని రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పంట తెగుళ్ల ఉధృతిపై కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్‌ను సంప్రదించగా ప్రస్తుత వాతావరణం పరిస్థితుల కారణంగా పలు రకాల తెగుళ్లు పంటలను ఆశిస్తున్నాయన్నారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పొలంబడులు, ఆత్మకమిటీ సమావేశాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆర్‌బీకే సిబ్బంది ద్వారా పత్రి గ్రామాన్ని సందర్శిస్తూ అక్కడి పంటలపై పరిశీలన చేసి రైతులకు సూచనలు చేస్తున్నామన్నారు. రైతులు తెగుళ్ల లక్షణాలను గుర్తించిన వెంటనే వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి



అసంపూర్తిగా నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణం

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటకు వెళ్లే రహదారిలో పంటకాలువపై ఉన్న కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బంధనపూడి రోడ్డు నుంచి చీకట్లవారిపేటకు వెళ్లేందుకు పంటకాలువపై కల్వర్టు లేకపోవడంతో గతంలో స్థానికులు తాటిపట్టిలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగించేవారు. పదేళ్ల క్రితం పంచాయతీరాజ్ నుంచి రూ.లక్ష నిధులను మంజూరు కాగా నిర్మాణం పనులు చేపట్టిన ఇంజినీరింగ్ అధికారులు కాలువపై శ్లాబ్ ఏర్పాటు చేసి దానికి ఇరువైపులా రక్షణగోడలు నిర్మించకుండా వదిలేశారు. రక్షణగోడల కోసం ఏర్పాటు చేసిన ఊసలు బయటకు చొచ్చుకు వస్తూ ప్రమాదకరంగా మారుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి రక్షణగోడలు లేక కాలువలోకి బోల్తా పడుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని రక్షణగోడలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శిథిల స్థితిలో బోడిపాలెం వంతెన



దెబ్బతిన్న బోడిపాలెం వంతెన రెయిలింగ్

కపిలేశ్వరపురం: కొత్తపేట-కపిలేశ్వరపురం నియోజకవర్గాలను కలిపే బోడిపాలెం వంతెన శిథిల స్థితిలో ఉంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇనుప భాగాలు తుప్పుపట్టి పైకి ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలు రాకపోకల సమయంలో రైతులు అవస్థలు పడుతున్నారు. కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మమఠ్రి దైవ, పర్యాటక ప్రాంతానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఈ వంతెన మీదుగా తరలి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత గల బోడిపాలెం వంతెనను పునః నిర్మించాలని పర్యాటకులు, భక్తులు, లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.